నమస్తే తెలంగాణ
వరంగల్ హనుమకొండ
5 | ఆదివారం 14 ఏప్రిల్ 2024 | WARANGAL HANUMAKONDA



పర్వతగిరిలోని తన స్వగృహంలో వరంగల్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్‌తో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

# సుధీర్ కుమార్‌ను గెలిపించుకోవాలి

- బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పర్వతగిరి, ఏప్రిల్ 13 : బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. శనివారం పర్వతగిరి మండలకేంద్రంలో ఆయన స్వగృహంలో మండల స్థాయి ముఖ్య కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగితే గెలుపు ఖాయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వంద రోజుల పాలనపై ప్రజలకు విరక్తి వచ్చిందని, పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీకి గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. తన ఇంటిలోనే పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నానని, పర్వతగిరి మండల అడ్‌హక్ కమిటీ అధ్యక్షుడిగా బూరుగుమళ్లకు చెందిన వరంగల్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఏడుదొడ్ల జితేందర్‌రెడ్డిని నియమిస్తున్నట్లు ప్రకటించారు. బీఆర్‌ఎస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి మారేపల్లి సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఎంపీ అభ్యర్థిగా ప్రకటించినందుకు అధినేత కేసీఆర్‌కు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి కార్యకర్త తనకు తానే ఎంపీ అభ్యర్థిగా భావించుకొని తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పర్వతగిరి ఎంపీపీ లూనావత్ కమలాపంతులు, వైస్ ఎంపీపీ ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, వర్ధన్నపేట ఎంపీపీ అప్పారావు, మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు, మండల కన్వీనర్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ జితేందర్‌రెడ్డి, మాజీ ఏఎంసీ డైరెక్టర్ యుగేంధర్‌రావు, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ సర్వర్, పీఏసీఎస్ చైర్మన్ మనోజ్‌గౌడ్, ఎంపీటీసీలు మాడుగుల రాజు, కర్నెళ్ల మోహన్‌రావు, మట్టపెల్లి లావణ్య, చిన్నపాక శ్రీనివాస్, ఏర్పుల శ్రీనివాస్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# చెరువుల్లో డేంజర్ గుంతలు

- ఎక్స్‌కవేటర్లతో అక్రమంగా మట్టి తవ్వకాలు
- మత్స్యకారులు, పశువులకు ప్రమాదకరం
- ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం



నర్సింహులపేట కుంటలో మట్టి తీయడంతో ఏర్పడిన గుంత

నర్సింహులపేట, ఏప్రిల్ 13: చెరువుల్లో ఎక్స్‌కవేటర్లతో అక్రమంగా మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. చెరువు మట్టి, మొరాన్ని తవ్వి తరలించాలంటే తహసీల్దార్, ఇరిగేషన్ అధికారుల అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ మండలకేంద్రమైన నర్సింహులపేట, పడమటిగూడెం, కొమ్ములవంచ గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో ఇష్టారాజ్యంగా మట్టి తవ్వేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఫలితంగా అక్కడ ఏర్పడిన భారీ గుంతలు మత్స్యకారులు, పశువులకు ప్రమాదకరంగా మారుతున్నాయి. అభివృద్ధి పనుల పేరుతో అక్రమార్కులు మట్టిదందా సాగిస్తున్నా ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీ అధికారులు తెలిసి కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తహసీల్దార్ నాగరాజును వివరణ కోరగా తాము ఎవరికీ అనుమతి ఇవ్వలేదని, ఎవరైనా అక్రమంగా చెరువు మట్టి తరలిస్తే చర్యలు తప్పవని చెప్పారు.

# బట్టలు ఉతికేందుకు వెళ్లి..

## క్వారీ గుంతలో పడి బాలిక మృతి



లిఖిత (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 13 : ప్రమాదవశాత్తుగా క్వారీ గుంతలో పడి ఓ బాలిక మృతిచెందిన ఘటన పట్టణ శివారులో శనివారం మధ్యాహ్నం జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ శివారులోని ఆర్తి గార్డెన్ సమీపంలో గుడిసెలు వేసుకొని నివసిస్తున్న బోడ వీరన్న-కుమారి దంపతులు రోజువారీగా కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నారు. వారి కుమార్తె లిఖిత(12) మధ్యాహ్నం బట్టలు ఉతికేందుకు కాలనీ పక్కనున్న క్వారీ వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో కాలు జారి నీళ్లలో పడింది. పక్కనున్న వారు గమనించి వెళ్లేసరికి బాలిక మృతిచెందింది. బాలిక తల్లిదండ్రులు టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



నాడు శివాజీనగర్‌లో తీరొక్క మొక్కలతో కళకళలాడిన పార్కు



దుగ్గొండి మండలం శివాజీనగర్‌లో ఎండిపోయిన రాశీ-నక్షత్ర వనం

# కళ తప్పిన వనం..

ఎండిపోయిన మొక్కలతో ఆవిరైన ఆహ్లాదం, పచ్చదనం

- కేసీఆర్ హయాంలో శోభాయమానంగా రాశీ-నక్షత్ర వనం
- కాంగ్రెస్ సర్కారు పట్టించుకోక అధ్వానంగా మారిన పార్కు



వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం శివాజీనగర్‌లో ఏర్పాటు చేసిన రాశి-నక్షత్ర వనం



నగరాలు, పట్టణాలకు దీటుగా గ్రామాలను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కేసీఆర్ సర్కారు ఏర్పాటుచేసిన పల్లె ప్రకృతి వనాలతో పచ్చదనం పరుచుకొని ఇటు పల్లెలకు కొత్త శోభ తీసుకురావడమే గాక ప్రజలకు ఆనందం, ఆహ్లాదాన్ని పంచేవి. అక్కడా ఇక్కడా అనే తేడా లేకుండా ఏ పల్లెలో అడుగిడినా రారమ్మని స్వాగతం పలికేవి. ఇలా మొన్నటివరకు తీరొక్క మొక్కలు, ఒక్కో ప్రత్యేకతతో వెలుగొందిన ఈ పార్కులు ఇప్పుడు నిర్వహణ సరిగ్గా లేక కళ తప్పి అధ్వానంగా మారాయి. కాంగ్రెస్ సర్కారు వచ్చిన తర్వాత తాగు, సాగునీటితో పాటు పల్లె ప్రకృతి వనాలనూ గాలికొదిలేసింది. ఫలితంగా ప్రభుత్వ పర్యవేక్షణ లోపం, అధికారుల నిర్లక్ష్యంతో ప్రకృతి వనాలు కళావిహీనంగా తయారయ్యాయి. ఇందుకు వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం శివాజీనగర్‌లోని రాశీ-నక్షత్ర వనమే నిదర్శనం. 27 నక్షత్రాలు, 12 రాశులకు సంబంధించిన మొక్కలతో ఉన్న ఈ చూడచక్కని పార్కు కాస్త ఇప్పుడు ఎండిపోయిన మొక్కలతో బోసిపోయింది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్, ఏప్రిల్ 13

# కొలిక్కిరాని చర్చలు నిలిచిన కొనుగోళ్లు

జనగామ మార్కెట్‌లో మారని తీరు

- వ్యాపారులు, అధికారుల మధ్య కుదరని ఏకాభిప్రాయం
- కేసులు ఉపసంహరించుకోవాలంటున్న ట్రేడర్లు
- సమస్యలను అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం
- మార్కెటింగ్ శాఖ ఉమ్మడి వరంగల్ జిల్లా డీడీ రాజూనాయక్ హామీ

జనగామ రూరల్, ఏప్రిల్ 13: జనగామ వ్యవసాయ మార్కెట్‌లో మూడు రోజులుగా ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. ధాన్యానికి మద్దతు ధర విషయమై రైతులు, వ్యాపారులకు మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా మార్కెటింగ్ శాఖ డీడీ రాజూనాయక్ శనివారం జనగామ మార్కెట్‌కు చేరుకొని ట్రేడర్లు, అడ్తిదారులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా వ్యాపారులు తమపై ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ఈ-నామ్ ప్రకారమే కొనుగోలు చేస్తున్నామని అధికారులకు తెలిపారు. వేసవి సీజన్‌లో అకాల వర్షాలు కురుస్తాయని భావించిన రైతులు వరి కోతలు చేపట్టారు. ఆరబెట్టని ధాన్యం మార్కెట్‌కు తీసుకొస్తుండడంతో తాలు, గడ్డి వస్తున్నందున ఈ-నామ్ ప్రకారం కొనుగోలు చేస్తున్నామని వ్యాపారులు తెలిపారు. ధాన్యం క్వాలిటీగా ఉంటే కొనుగోలు చేస్తామని తెలిపారు. ఎంఎస్‌పీ చెల్లించడం సాధ్యపడదన్నారు.



ట్రేడర్లు, అడ్తిదారులతో చర్చిస్తున్న మార్కెటింగ్ శాఖ డీడీ రాజూనాయక్

ట్రేడర్ల సంఘం అధ్యక్షుడు నాగబండి రవీందర్ మాట్లాడుతూ ఇప్పటి నుంచి మార్కెట్‌లో ఎలాంటి సరుకులు కొనుగోలు చేయబోమని స్పష్టంచేశారు.

### సమస్యలపై అదనపు కలెక్టర్‌తో చర్చిస్తాం : మార్కెటింగ్ శాఖ డీడీ

ట్రేడర్లు, వ్యాపారులతో జరిగిన చర్చలపై ఉమ్మడి వరంగల్ జిల్లా మార్కెటింగ్ శాఖ డీడీ రాజూనాయక్ స్పందించారు. ఈ-నామ్ ప్రకారమే ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, ఎంఎస్‌పీ సాధ్యం కాదని వ్యాపారులు తెలిపారని వివరించారు. వ్యాపారులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని కోరారని, దీనిపై అదనపు కలెక్టర్‌తో మాట్లాడుతామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ధాన్యం కొనుగోలు చేయాలని ట్రేడర్లు, వ్యాపారులకు తెలిపామని పేర్కొన్నారు. త్వరలోనే సమస్యను పరిష్కరించి ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ అధికారి నరేంద్ర, మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్, తహసీల్దార్ వెంకన్న, ట్రేడర్లు, నాగబండి రవీందర్, గోవింద్, బజాజ్ పాల్గొన్నారు.



జనగామ మార్కెట్‌లో కొనుగోళ్లు లేక పేరుకుపోయిన ధాన్యం నిల్వలు

# నామాలపాడుకు అధికార యంత్రాంగం

- ధర్మాపురం నుంచి పైపులైన్ ఏర్పాటు
- తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు
- 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన






నమస్తే ఎఫెక్ట్

నీరందించేందుకు ఏర్పాటు చేసిన పైపులైన్

బయ్యారం, ఏప్రిల్ 13 : కొద్దిరోజులుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్న బయ్యారం మండలం నామాలపాడు గ్రామాన్ని అధికారుల బృందం శనివారం సందర్శించింది. 'నీళ్ల కోసం మైళ్ల దూరం' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో శనివారం ప్రచురితమైన కథనానికి స్పందించిన డీఎల్‌పీవో హరిప్రసాద్, మిషన్ భగీరథ ఇంట్రా(ఆర్‌డబ్ల్యూఎస్) ఈఈ కృష్ణారెడ్డి, డీఎల్‌పీవో గంగాభవాని, ఇతర జిల్లా అధికారులు గ్రామానికి వెళ్లి పరిశీలించారు. నీటి సమస్య గురించి స్థానికులను అడిగి తెలుసుకొని పరిష్కారం కోసం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. గ్రామానికి నీటిని సరఫరా చేసే బోరు పనిచేయకపోవడంతో పక్కనున్న ధర్మాపురం గ్రామానికి నీటిని సరఫరా చేసే బోరు మోటార్ నుంచి నామాలపాడుకు కూడా అందించేలా పైపులైన్ వేశారు. పాత బోరు మోటరుకు కూడా త్వరలో మరమ్మతులు చేయిస్తామని, అవసరమైతే కొత్తది వేయించి మరోసారి సమస్య తలెత్తకుండా చూస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఇక్కడ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీజా, రఘుపతిరెడ్డి, సెక్రటరీ సంగీత ఉన్నారు. ఆ తర్వాత ఎంపీడీవో కార్యాలయంలో డీఎల్‌పీవో, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, సెక్రటరీలతో సమీక్ష నిర్వహించి సూచనలు చేశారు.

# 'సెలైన్ బాటిల్‌లో ఫంగస్'పై డీఎంహెచ్‌వో విచారణ



సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి కళావతిబాయి

దంతాలపల్లి, ఏప్రిల్ 13: వైద్యం కోసం దంతాలపల్లి ప్రభుత్వ దవాఖానకు వచ్చిన ఓ గర్భిణికి సిబ్బంది నిర్లక్ష్యంతో ఫంగస్ ఉన్న సెలైన్ బాటిల్ ఇచ్చిన ఘటనపై శనివారం జిల్లా వైద్యాధికారి కళావతి బాయి విచారణ చేపట్టారు. దవాఖానలోని మందుల రిజిస్టర్లను పరిశీలించారు. సెలైన్ బాటిల్‌లో ఫంగస్ రావడంతో ఎక్కడో పొరపాటు జరిగిందని, దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. బాటిల్ రాష్ట్రంలో ఎక్కడినుంచి సరఫరా అయ్యిందనే వివరాలను తీసుకుంటామని పేర్కొన్నారు. నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. దాట్ల గ్రామంలో గర్భిణి నర్కూటి సునీత ఇంటికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది చేసిన పొరపాటును జిల్లా వైద్యాధికారి కప్పిపుచ్చే ప్రయత్నం చేశారు. మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో అంబరీష, డీపీహెచ్‌ఎన్‌వో మంగమ్మ, స్థానిక డాక్టర్ చైతన్య, సీహెచ్‌వో బాలాజీ, సూపర్‌వైజర్ పద్మ పాల్గొన్నారు.

# ఉద్యోగాలిప్పిస్తామని 8 లక్షలు వసూలు

## ఇద్దరి అరెస్ట్
## రూ.4.8 లక్షలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కిశోర్ కుమార్

పరకాల, ఏప్రిల్ 13 : ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురిని మోసం చేసి డబ్బులు వసూలు చేసిన ఇద్దరిని అరెస్టు చేసి రూ.4.8లక్షల నగదుతో పాటు నకిలీ ఆర్డర్ కాపీలు, ఒరిజినల్ మెమోలు, రెండు ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ కిశోర్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో వాహనాల తనిఖీ చేస్తుండగా, ఇద్దరు అనుమానాస్పదంగా కనిపించారు. వీరిని విచారించగా పరకాల వికాస్‌నగర్ కాలనీకి చెందిన అరికెళ కార్తీక్, సీఎస్‌ఐ కాలనీకి చెందిన పెరిక చరణ్‌గా తేలింది. కార్తీక్ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎంసీఏ పూర్తి చేసి 2019లో వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంకులో టెంపరరీ క్లర్క్‌గా జాయిన్ అయ్యాడు. 2020లో చరణ్‌తో కలిసి సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆలోచన చేశాడు. ఈ క్రమంలో డీసీసీ బ్యాంకులో తమకు తెలిసిన వారు ఉన్నారని, అందులో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ చరణ్ బంధువులు, స్నేహితులు, కాలనీ వాసుల నుంచి మొత్తం రూ.8.16లక్షలను వసూలు చేశారు. అంతే కాకుండా wdccbro@gmail.comతో పాటు మరో రెండు ఈ మెయిల్స్ క్రియేట్ చేసి వాటి ద్వారా ఆర్డర్ కాపీలను పంపారు. ఆ తర్వాత సర్టిఫికెట్ వెరిఫికేషన్ అంటూ వారి వద్ద నుంచి ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకున్నారు. కాగా, జరిగిన మోసాన్ని తెలుసుకుని బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. కార్యక్రమంలో సీఐ రవిరాజు, ఎస్సై రమేశ్ పాల్గొన్నారు.

# వరికోల్‌పల్లిలో గుప్త నిధుల తవ్వకాలు

- విగ్రహాలు స్వాధీనం..
- ఏడుగురిపై కేసు నమోదు



గుప్త నిధుల తవ్వకాల్లో స్వాధీనం చేసుకున్న వెంకటేశ్వరస్వామి, లక్ష్మీదేవి విగ్రహాలు

చిట్యాల, ఏప్రిల్ 13 : గుప్త నిధుల తవ్వకాల్లో బయటపడ్డ విగ్రహాలను స్వాధీనం చేసుకొని ఏడుగురుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ శనివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం వరికోల్‌పల్లి గ్రామ శివారులో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపినట్లు పంచాయతీ కార్యదర్శి విష్ణు ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అదే గ్రామానికి చెందిన వంగల రమేశ్, గోవిందుల రాజయ్య, సదయ్య, చెక్క రమేశ్, గుండెబోయిన సదయ్య, అందుకుతండాకు చెందిన దామరశెట్టి వీరయ్య, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా ఎనమందల గ్రామానికి చెందిన వల్లాపు జనార్దన్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపినట్లు ఒప్పుకోవడంతో వారి వద్ద నుంచి విగ్రహాలను స్వాధీనం చేసుకున్నారు. వాటిలో వేంకటేశ్వరస్వామి, లక్ష్మీదేవి విగ్రహాలున్నట్లు గుర్తించామని ఎస్సై తెలిపారు.

# హరిత హోటల్‌లో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభం



హనుమకొండ, ఏప్రిల్ 13 : హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభమైంది. ఈ ప్రదర్శన ఈ నెల 17వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఇందులో సహజ నారపట్టు వస్త్రాల ప్రదర్శన, చీరెలు, వస్త్రాలు, దుస్తులు, హోం లెనిన్, మాక్సెసరీస్, విక్రయాలు ఉంటాయన్నారు. ఒకే చోట బనారస్, కాంచీపురం, బీహార్ తస్సార్, గుజరాత్, పశ్చిమ బెంగాల్ టైలు, హ్యాండ్ పెయింటెడ్ చీరెలు, ధాకాయి జంధాని, పైథాని, చందేరి, హ్యాండ్ కలంకారి మరెన్నో చేనేత వస్త్రాలు ప్రదర్శిస్తారని తెలిపారు.

